# 'నేను' అనేదే దైవం

**వేద వేదాంగములు వల్లె వేసియున్న**
**పద్యగద్యంబులను కూర్పగలిగియున్న**
**చిత్తశుద్ధియు లేకున్న చెడును వాడు**
**సత్యమును తెల్పుమాట ఈ సాయిమాట!**

ప్రేమస్వరూపులారా! లౌకిక విద్యలు ఎన్ని నేర్చినప్పటికీ చిత్తశుద్ధియే లేకుండిన ఆత్మతత్త్వం అణుమాత్రమైనా అర్థం కాదు. ఎంతటి గొప్ప పండితుడైనా కన్నులు మూసుకుంటే తన దేహాన్ని తాను చూసుకోలేడు. ఎట్టి విద్యలూ నేర్వనివాడైనా కన్నులు తెరచి చూస్తే తన దేహాన్ని తాను చూసుకోగలడు, పరిసరాలనుకూడా గమనించగలడు. నివురుగప్పిన నిప్పువలె మానవుడు మాయచేత బంధింపబడటంచేత తన తత్త్వాన్ని తాను గుర్తించు కోలేకపోతున్నాడు. మానవత్వమునకు, దివ్యత్వమునకు మధ్యగల సన్నిహిత సంబంధబాంధవ్యమును మొదట గుర్తించాలి. ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశించి, చిత్తశుద్ధితో దివ్యత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించినప్పుడు ఎంతటి గొప్ప శక్తినైనా హస్తగతం చేసుకోవచ్చు.

సాధన అనగా కేవలం జపము, ధ్యానము, పూజలు ఇత్యాది సత్కర్మలనాచరించటం కాదు. అంతఃకరణకు అడ్డు తగిలే మాయతెరను తొలగించుకోవటానికి ప్రయత్నించటమే నిజమైన సాధన. నివురును ఊదిన తక్షణమే నిప్పు కనిపిస్తుంది. పాచిని తొలగించిన తక్షణమే పరిశుద్ధమైన జలము గోచరిస్తుంది. కంటిని కప్పిన క్యాటరాక్టును తొలగిస్తే జగత్తు సుస్పష్టంగా గోచరమవుతుంది. అదేరీతిగా, మాయ తెరను దాటి ఆవలకు వెళితే ఒక్క దివ్యత్వం తప్ప మరేదీ కనిపించదు.

మనస్సుకు ఈవల ఉన్నంతవరకే ఈ దేహము, ఈ ప్రపంచము, ఈ కష్టసుఖములు కనిపిస్తాయి. ఈనాటి మానవుడు మనస్సును అడ్డుపెట్టుకొని దివ్యత్వాన్ని దర్శించాలని ప్రయత్నం చేస్తున్నాడు. దివ్యత్వాన్ని చూడాలంటే ఆత్మ తత్త్వాన్ని గుర్తించాలి. ఆత్మ రూపరహితమైనది. కనుక దేహభ్రాంతిని వీడనంతవరకు మానవునికి ఆత్మ అంటే ఏమిటో అర్థం కాదు. ప్రతి

srisathyasaivaganamrutam

మానవుడు 'నేను' అనే శబ్దమును ఉపయోగిస్తున్నాడు కదా! ఆ 'నేనే' ఆత్మ. కాబట్టి ఆత్మ అనేది ప్రతి మానవునియందున్నది. అది సర్వవ్యాపకమైనది. కాని, కంటికి కనిపించదు.

**భూతాకాశము - చిత్తాకాశము - చిదాకాశము**

వేదాంత పరిభాషలో భూతాకాశము, చిత్తాకాశము, చిదాకాశము అనేవి మూడున్నవి. భూతాకాశమును మ్రింగినది చిత్తాకాశము, చిత్తాకాశమును మ్రింగినది చిదాకాశము. పర్వతాలు, అడవులు, నదులు, సముద్రాలతో కూడిన ఈ విశాలమైన భూమండలంకంటే సూర్యమండలం ఎన్నో రెట్లు పెద్దది. కాని, అది మనకు తొమ్మిది కోట్ల మైళ్ళ దూరంలో ఉండటంచేత చిన్నదిగా కనిపిస్తోంది. ఇంక, నక్షత్రాలు సూర్యునికంటే ఎన్నో రెట్లు పెద్దవి. కాని, అవి సూర్యునికంటే ఎంతో దూరంలో ఉండటంచేత మన కంటికి చిన్నచిన్న డైమండ్లువలె కనిపిస్తున్నాయి. నక్షత్ర కాంతి ఒక సెకెనుకు అనేక వేల మైళ్ళ దూరం ప్రయాణం చేస్తుంది. అయితే, ఈనాటికి కొన్ని నక్షత్రముల కాంతి ఇంకా భూమిని చేరుకోలేదు. నక్షత్రములు, సూర్యుడు, చంద్రుడు, భూమి ఇవన్నీ భూతాకాశములో భాగములు. ఈ భూతాకాశమును మించినది చిత్తాకాశము. భూమి, సూర్యచంద్రులు, నక్షత్రాలు ఇవన్నీ చిత్తములో చిన్నరూపంగా ఇమిడియున్నాయి. సూర్యుడు స్వప్రకాశకుడని మీరు భావిస్తున్నారు. కాని, సూర్యునికి ప్రకాశము ఆత్మనుండియే చేకూరుతున్నది. కనుక, ఆత్మయే అన్నింటికంటే గొప్పది. ఇదే చిదాకాశము. దీని విశాలత్వము ఇట్టిది, అట్టిది అని ఎవ్వరూ వర్ణించలేరు. ఈ జగత్తులో ప్రతి పదార్థమునకూ ఒక రూపమున్నది. ప్రతి పదార్థమూ అణువులతో కూడినది.

ఆత్మ రూపరహితమైనది కాబట్టి, అణువుకంటే అతి సూక్ష్మమైనది. ఆత్మదర్శన మనగా ఏమిటి? సర్వవ్యాపకమైన ప్రకాశతత్త్వమును దర్శించటమే. ప్రతి మానవునియందు, ప్రతి కణమునందు ఆత్మతత్త్వమున్నది. దీనిని అర్థం చేసుకోవాలంటే ఆకారానికి అతీతం కావాలి. ఈ జగత్తులోనున్న సమస్త పదార్థములూ ఆకారంతో కూడినవే. అయితే, కొంతకాలమునకు ఈ ఆకారములు ఆత్మలో లీనమై ఆకారరహితమైపోతాయి. మానవుడుకూడా ఆకారానికి అతీతుడై ఆత్మలో లీనంకావటానికి ప్రయత్నించాలి. ఆకారమునకు సంబంధించిన సమస్త కర్మలూ భూతాకాశములోనివే.

sri sathyasai vahinamrutam

## అజ్ఞానాంధకారం తొలగితే ఆత్మసాక్షాత్కారం

ఆత్మ కదిలేది కాదు, మెదిలేది కాదు. వేదము దీనిని "నిరాకారం, నిర్గుణం, నిరంజనం..." అని వర్ణించింది. ఆత్మ అనంతమైనది. దీనికి ఎట్టి ఆకారమునూ నిర్ణయించటానికి వీలుకాదు. ఆకారరహితమైన ఆనందమే ఆత్మ. ఇట్టి ఆత్మతత్త్వమును గుర్తించుటకు ప్రాచీన ఋషులు ఎంతో కృషి సల్పి కట్టకడపటికి "వేదాహమేతం పురుషం మహాన్తం ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్" అన్నారు. ఓ ప్రజలారా! కాంతిస్వరూపమైనది ఆత్మ. దీనిని చూచుటకు అరణ్యానికి వెళ్ళి తపస్సు చేయనక్కర్లేదు; ఎక్కడ కావలసినా చూడవచ్చును. కంటిని కప్పిన పొరను తొలగిస్తే జగత్తు కనిపించినట్లుగా, అంతఃకరణను ఆవరించిన అజ్ఞానమనే చీకటిని దూరం చేస్తే ఆత్మ సాక్షాత్కరిస్తుంది. అంతఃకరణను ఆవరించిన మాలిన్యమును తొలగించుకోవటమే నిజమైన సాధన. మానవత్వంలోనే దివ్యత్వమున్నదనే సత్యాన్ని మీరు గుర్తించుకోలేక దివ్యత్వానికి అనేక రూపనామములను కల్పించి వ్రతములద్వారా, పూజలద్వారా దీనిని దర్శించుటకు ప్రయత్నిస్తున్నారు. కనుకనే, నిరాశానిస్పృహలకు గురి అవుతున్నారు. మీరు మొట్టమొదట భూతాకాశంలో అంతర్లీనమై ఉన్న దివ్యత్వాన్ని గుర్తించుటకు ప్రయత్నించాలి. తన యందున్న మానవత్వమునే గుర్తించుకోలేని మానవుడు దివ్యత్వాన్ని ఏరీతిగా గుర్తించగలడు? మొట్టమొదట తనలోని మానవత్వాన్ని గుర్తించాలి. భూతాకాశ, చిత్తాకాశములను గుర్తించిన తరువాతనే చిదాకాశమును గుర్తించటానికి వీలవుతుంది. భూతాకాశము చిత్తాకాశములో చిన్న చుక్కగా ఉంటున్నది. అదేరీతిగా, చిత్తాకాశము చిదాకాశములో మరింత చిన్నదిగా గోచరిస్తున్నది. ఈ చిదాకాశమునే ఆత్మ అన్నారు. ఇంతకంటే మరొకరీతిగా వర్ణించుటకు వీలుకాదు.

## రూపానికి అతీతులు కావాలి

రూపరహితమైన తత్త్వాన్ని గుర్తించాలంటే మీరు రూపానికి అతీతులు కావాలి. మీరు ధ్యానం చేయటానికి మొదట ఒక రూపాన్ని నిర్ణయించుకుంటారు. కాని, క్రమక్రమేణ ఆ రూపానికి అతీతులైనప్పుడే దివ్యత్వమును తెలుసుకోగలరు. మీరు రూపానికి అతీతులు కానంతవరకు మీకు కష్టసుఖములు తప్పవు. రూపరహితమైనది ఆత్మతత్త్వం. ఇలాంటి రూపరహితమైన తత్త్వం మీకు సుషుప్తి (గాఢనిద్ర)లో అనుభూతికి వస్తున్నది. ఎందుకంటే,

srisathyasaivahamrutam

గాఢనిద్రలో మీకు ఎట్టి రూపమూ లేదు, ఎట్టి నామమూ లేదు; మీలో లౌకికమైన, భూతాకాశమునకు సంబంధించిన భావాలుకూడా ఉండవు. భూతాకాశము మీ దృష్టిలో ఉన్నంత వరకు మీరు రూపనామములకు కట్టుబడియే ఉంటారు.

మీరిన్ని చదువులు చదువుతున్నారు గాని, భూతాకాశమంటే ఏమిటో, చిత్తాకాశమంటే ఏమిటో, చిదాకాశమంటే ఏమిటో గుర్తించలేక పోతున్నారు. పైగా, ఈ వేదాంతం మాకక్కర్లేదని భావిస్తున్నారు. ఇది వేదాంతం కాదు. నిత్య జీవితంలో మీరు తెలుసుకొని ఆచరించవలసిన సత్యసూక్తులివి. భూతాకాశంలో భూతములు అనేకంగా గోచరించినప్పటికీ అన్నింటియందు మారని సత్యమొకటున్నది. అదే ఆత్మ. ప్రతి మానవుడు 'నేను' అనే పదమును ఉపయోగపెడుతుంటాడు. చిన్న పిల్లవాడు 'నేను' అంటాడు. యువకుడైన తరువాతకూడా 'నేను' అంటాడు. వృద్ధుడైన తరువాతకూడా 'నేను' అంటాడు. ఈవిధంగా, బాల్య, యౌవన, వార్ధక్య స్థితులు మార్పు చెందుతున్నాయిగాని, 'నేను' అనేది మార్పు చెందటం లేదు కదా! ఆ మార్పు చెందని "నేనే" ఆత్మ. తనయందే ఉన్న దివ్యత్వమును గుర్తించుకోలేక మానవుడు భౌతికమైన, ప్రాకృతమైన విషయాల కోసం పరుగులిడుతున్నాడు. ఇది ప్రవృత్తియొక్క లక్షణం. ఆత్మ నివృత్తికి సంబంధించినది. మానవుడు ప్రవృత్తి లక్షణాలను కలిగియుండటంచేతనే తనను తాను తెలుసుకోలేకపోతున్నాడు.

**అదే ఇది, ఇదే అది**

మీరు చూసేదంతా భగవత్స్వరూపమే. ఈ హాలు భగవత్స్వరూపమే. మీరందరూ భగవత్స్వరూపులే. అయినప్పటికీ మీరింకా భగవంతుని చూడాలని ఆశిస్తున్నారు. ఇది మూఢత్వం కాదా? కనుకనే "పశ్యన్నపి చ నపశ్యతి మూఢో" అన్నారు. దీనికొక చిన్న ఉదాహరణ : మన 'సాయిగీత'ను హాస్టల్ పిల్లలు ప్రతి రోజూ చూస్తూనే ఉంటారు. అది వారికంత ఆశ్చర్యమనిపించదు. కాని, వారు బందిపూర్ అడవికో, మదుమలై అడవికో వెళ్ళినప్పుడు అక్కడ ఏనుగు తోక కనిపించినా ఎంతో ఆశ్చర్యంగా తిలకిస్తారు, ఎంతో ఆనందిస్తారు. అదేరీతిగా మీరు భగవంతుణ్ణి ఇంతమందిలో చూస్తున్నప్పటికీ మీకు ఆశ్చర్యం కల్గటంలేదుగాని, ఎక్కడైనా మూడు తలల వ్యక్తి కనిపించాడంటే విశ్వవిరాట్స్వరూపాన్ని చూశామని

sri sathyasai vahini amrutam

ఆనందంతో పొంగిపోతారు. దివ్యత్వం ప్రకృతి అంతా వ్యాపించియున్నదనే సత్యాన్ని మీరు అర్థం చేసుకోవాలి. కృష్ణుడు భగవద్గీతలో "మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః" అన్నాడు. "అందరియందున్నది నా అంశమే. నీవు, నేను వేరు కాదు" అనే సత్యాన్ని మీరు చక్కగా అర్థం చేసుకుంటే మళ్ళీ ప్రత్యేకంగా దైవాన్ని చూడాలని ఆశించరు.

## 'స్వ'భావాన్ని గుర్తిస్తే భయానికి తావు లేదు

మీరు విశ్వవిరాట్స్వరూపాన్ని చూస్తూనే ఉన్నారు. మీకు కనిపించే ఆకారములన్నీ భగవత్స్వరూపములే. ఆకారము ప్రవృత్తియొక్క లక్షణం. ఇదే మాయకు మూలం. మాయ అంటే ఏమిటి? మాయకొక ప్రత్యేకమైన రూపము లేదు. ఉన్నదాన్ని మరపింపజేసేదే మాయ. మీరు చీకటిలో ఒక త్రాడును చూసి పామని భ్రమించి భయపడ్డారు. వెంటనే ప్రక్క వ్యక్తినుండి టార్చిలైటు వేసికొని చూస్తే అది పాము కాదు, త్రాడని తేలిపోయింది. దాంతో భయంకూడా పోయింది. అంతకుముందు పాము రాలేదు, త్రాడు పోలేదు. టార్చిలైటు వేసిన తరువాత పాము పోలేదు, త్రాడు రాలేదు. అప్పుడూ, ఇప్పుడూ ఉన్నది త్రాడే. ఒకదానిని చూసి మరొకటిగా భ్రమించటమే మాయ. సత్యాన్ని గుర్తిస్తే మీకు మాయ అడ్డు రాదు. మీరు ప్రపంచమందలి వస్తువుల ప్రభావానికిలోనై మీ స్వభావాన్ని మరచిపోతున్నారు. మీ 'స్వ' (ఆత్మ) భావాన్ని మీరు తెలుసుకుంటే ఎట్టి భయానికి, భ్రాంతికీ అవకాశముండదు. మీకంటే వేరుగా ఇంకొకరు లేనప్పుడు, మీరే సర్వస్వరూపులైనప్పుడు మీకింక భయమెందుకు?

## వేషానికి తగిన ప్రవర్తన ఉంటేనే గౌరవం

ఒక పగటి వేషగాడు శంకరాచార్యులవారి వేషం వేసుకొని ఒక మహారాజుగారి ఆస్థానంలో ప్రవేశించి చక్కని ఆధ్యాత్మిక బోధలు సల్పాడు.

మాతా నాస్తి పితా నాస్తి నాస్తి బంధు స్సహోదరః
అర్థం నాస్తి గృహం నాస్తి తస్మాత్ జాగ్రత జాగ్రత
జన్మ దుఃఖం జరా దుఃఖం జాయా దుఃఖం పునః పునః
అంత్యకాలే మహాదుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రత

ఈవిధంగా శ్లోకాలను వల్లించేసరికి మహారాజు చాలా ఆనందించి, ఒక ప్లేటు నిండుగా

sri sathyasaivachanamrutam

బంగారు కాసులు తెప్పించి అతనికి బహూకరించ బోయాడు. అతడు "రాజా! సర్వసంగపరిత్యాగినైన నాకు బంగారు కాసులెందుకు?" అని వాటిని తిరస్కరించాడు. మరుసటిరోజు అదే వ్యక్తి ఒక నర్తకి వేషం వేసుకొని సభలో గొప్పగా నృత్యం చేశాడు. రాజు మళ్ళీ అతనికి కొన్ని బంగారుకాసు లివ్వబోగా "రాజా! ఇవి నాకు చాలవు" అన్నాడు. రాజు ఆశ్చర్యచకితుడై "అయ్యా! నిన్నటి దినము అసలు బంగారుకాసులే వద్దన్నావు. ఈనాడు ఇచ్చినవి చాలవంటున్నావు. దీని ఆంతర్య మేమిటి?" అని అడిగాడు. అప్పుడా పగటి వేషగాడు "రాజా! నిన్న సన్యాసి వేషం వేశాను కాబట్టి, అసలు బంగారమే వద్దన్నాను. ఈనాడు నర్తకి వేషం వేశాను. కాబట్టి, ఇంకా కావాలని అడుగుతున్నాను. వేషానికి తగిన ప్రవర్తన ఉంటేనే గౌరవం ఉంటుంది" అన్నాడు.

## ఆత్మ విశ్వాసం : లింకన్ ఆదర్శం

ఈనాటి మానవుడు మానవ వేషాన్ని ధరించాడు గాని, మానవత్వాన్ని మరచిపోతున్నాడు. తాను మానవునిగా పుట్టినందుకు మానవతా విలువలను పోషించుకోవాలి. ఆత్మవిశ్వాసంతో జీవించాలి. ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలి. మీకు తెలుసు – లింకన్ చాలా బీద కుటుంబంలో జన్మించాడు. తాను వేసుకున్న దుస్తులను చూసి స్కూల్లో తోటి పిల్లలు హేళన చేస్తుంటే భరించలేక ఒకనాడతడు ఏడుస్తూ తల్లివద్దకు వచ్చి "అమ్మా! నా తోటి పిల్లలందరూ నా దుస్తులను చూసి నన్నొక దరిద్రునిగా భావించి హేళన చేస్తున్నారు. కాబట్టి నాకు మంచి దుస్తులు కుట్టించు" అన్నాడు. అప్పుడతని తల్లి "నాయనా! మన పరిస్థితిని నీవు చక్కగా అర్థం చేసుకో. ఆత్మగౌరవమును మించిన అలంకారం లేదు. ఇతరులు ఏమైనా అనుకోనీ, నీవు లెక్కచేయవద్దు. ఆత్మవిశ్వాసంతో జీవించు, ఆత్మగౌరవాన్ని కాపాడుకో" అని బోధించింది.

తల్లి చేసిన బోధ లింకన్ హృదయంపై చెరగని ముద్ర వేసింది. తరువాత కొంతకాలానికి తల్లి మరణించింది. తండ్రి రెండవ వివాహం చేసుకున్నాడు. అతని సవతి తల్లికూడా "నాయనా! నీ తల్లి బోధించినట్లుగా ఆత్మవిశ్వాసాన్ని పెంచుకో, ఆత్మ గౌరవంకోసం పాటుపడు" అని బోధిస్తూ వచ్చింది. మరి కొంతకాలానికి తండ్రికూడా మరణించాడు. లింకన్ చిన్న వ్యాపారాన్ని ప్రారంభించాడు. ఎలాంటి పరిస్థితిలోనూ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోలేదు. అతని మంచితనాన్ని



srisathyasaivachanamrutam

గుర్తించి స్నేహితులందరూ అతనిని ఎన్నికలలో పోటీ చేయవలసిందని ప్రోత్సహించారు. వారి ప్రోద్బలంచేత లింకన్ ఎన్నికలలో పోటీ చేసి విజయం సాధించాడు. క్రమక్రమేణ అమెరికా ప్రెసిడెంటుగా ఎన్నికైనాడు. బీదకుటుంబంలో పుట్టిన లింకన్ అమెరికా అధ్యక్ష పదవి నలంకరించగల్గాడంటే కారణమేమిటి? ఆత్మ విశ్వాసాన్ని పోషించుకోవటమే, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవటమే. విద్యార్థులారా! ఆత్మ అంటే ఏమిటో సరిగా అర్థం చేసుకోండి. వేదము "అహం బ్రహ్మాస్మి" (నేనే బ్రహ్మను) అని బోధించింది. ఈ తత్త్వమును మీరు గుర్తించు కోవాలి. అయితే నా ఉద్దేశ్యంలో ఇదికూడా సరియైనది కాదు. ఎందుకంటే, ఇందులో అహం, బ్రహ్మ అనే రెండు పదాలున్నాయి. Truth is one, not two. ద్వైతముతో కూడినది సత్యము కానేరదు. కనుక, మీరు ఏకత్వాన్ని విశ్వసించి, ఏకత్వాన్ని వరించి మీ జీవితాన్ని సార్థకం చేసుకోవాలి. ఆత్మశక్తిపై మీరు ఆధారపడాలి. ఆత్మను మించిన శక్తి మరొకటి లేదు.

**శివరాత్రి విశిష్టత**

ఈనాడు శివరాత్రి, మహా పవిత్రమైన దినము. ప్రతి రోజూ మనం రాత్రిని చూస్తూనే ఉన్నాము. ఈ శివరాత్రికి మిగిలిన రాత్రులకు తేడా ఏమిటి? 'శివము' అనగా మంగళకరము, పవిత్రము అని అర్థం. దీనిని మంగళకరమైన రాత్రి అని ఎందుకన్నారు? మనస్సుకు 16 కళలున్నాయి. అందులో ఈ రాత్రి 15 కళలు లయమై ఒక్క కళ మాత్రమే మిగిలి ఉంది. కనుక, ఈ రాత్రి పవిత్రమైనది, దివ్యమైనది, భవ్యమైనది. ఈ రాత్రి మీరు పవిత్రమైన భావంతో సాధన చేస్తే ఆ మిగిలిన ఒక్క కళకూడా లయమై దివ్యత్వం ప్రాప్తిస్తుంది. ఏమిటి మీరు చేయవలసిన సాధన? హృదయమును ఆవరించిన మాలిన్యమును దూరం చేసుకోవటమే. అనగా, అంతఃకరణను మూసిపెట్టే దుర్గుణాలను, దుర్భావాలను దూరం చేసుకోవాలి. ఇంద్రియాల దుర్వినియోగంవల్లనే దుర్గుణాలు ప్రారంభమౌతున్నాయి. సమస్త Sins కు (పాపములకు) Senses (ఇంద్రియాల) దుర్వినియోగమే మూలకారణం. జపమాల పట్టుకొని, కన్నులు మూసుకొని "రాం, రాం..." అంటూ దైవచింతన చేసినంత మాత్రాన దైవం సాక్షాత్కరించదు; మీలో పవిత్రమైన భావాలను అభివృద్ధిపరచుకోవాలి. ఒక్క దైవభావం తప్ప మీలో మరే భావమూ ఉండకూడదు. ఎవరిని చూసినా దైవభావంతో చూడాలి. అందరినీ గౌరవించాలి. "అందరూ నావారే, నేను అందరివాడనే" అనే విశాలమైన భావాన్ని మీలో

sri sathyasaivachanamrutam

అభివృద్ధి గావించుకున్నప్పుడు జీవితంలో మీకెంతో హాయి కల్గుతుంది; చింత కించిత్తైనా కనిపించదు. ఏమిటీ జీవితం?

**పునరపి జననం పునరపి మరణం**
**పునరపి జననీ జఠరే శయనం**
**ఇహ సంసారే బహు దుస్తారే**
**కృపయా పారే పాహి మురారే**

**అన్నారు శంకరాచార్యులవారు. ఒకనాడు ఆయన తన శిష్యులతోకూడి గంగానదికి వెళుతుంటే మార్గమధ్యంలో ఒక బ్రాహ్మణుడు "డుకృఞ్కరణే, డుకృఞ్కరణే" అంటూ వల్లెవేయటం చూసి అతనివద్దకు వెళ్ళి "నాయనా! నీవు వల్లెవేస్తున్న దేమిటి?" అని అడిగారు. ఆ బ్రాహ్మణుడు "నేను పాణిని వ్యాకరణాన్ని నేర్చుకుంటున్నాను" అన్నాడు. దీనివల్ల కలిగే ఉపయోగమేమిటని శంకరులు ప్రశ్నించగా "నేను గొప్ప పండితుడనై రాజాస్థానంలో ప్రవేశించి, కావలసినంత ధనం సంపాదిస్తాను. ఆ ధనంతో నేను, నా కుటుంబం సుఖంగా జీవిస్తాము" అన్నాడు. "ఎంతకాలం సుఖాలను అనుభవిస్తావు?" అన్నాడు. ఆ తరువాత ఏమౌతుందంటే, తనకు తెలియదన్నాడు. అప్పుడు శంకరులవారు చెప్పారు.**

**భజగోవిందం భజగోవిందం**
**గోవిందం భజ మూఢమతే**
**సంప్రాప్తే సన్నిహితే కాలే**
**నహినహి రక్షతి డుకృఞ్కరణే**

"పిచ్చివాడా! ఉన్నంతవరకు అనుభవిస్తావు. ఆ తరువాత నిన్ను చూసేవారెవరు? కనుక, గోవిందుని భజించు. లౌకిక విద్యలు కొంతకాలం మాత్రమే సహాయం చేస్తాయి. యౌవనమును చూసుకొని మురిసిపోవద్దు. ఇదెలా వచ్చిందో అలానే పోతుంది. కాబట్టి దైవాన్ని నమ్ముకో. ఆత్మవిశ్వాసాన్ని పెంచుకో" అని బోధించారు. ఆత్మవిశ్వాసంవల్లనే ఆత్మసంతృప్తి కల్గుతుంది. ఆత్మసంతృప్తి కల్గినప్పుడే స్వార్థత్యాగం చేయవచ్చును. స్వార్థత్యాగం చేసినప్పుడే ఆత్మసాక్షాత్కారం

sri sathyasai vachanamrutam

కల్గుతుంది.

**ఆత్మ విశ్వాసంలోనే సర్వసాధనల ఫలితముంది**

విద్యార్థులారా! "నేను" అనేదే నిత్యసత్యమైనది. కాబట్టి "నేను" అనేదే దైవమని భావించుకోండి. ఆధారం లేనిదే ఆధేయంలేదు. జలము లేక అలలు లేవు కదా! అదేరీతిగా, ఆత్మయే అన్నింటికీ ఆధారం. లోకసంబంధమైన విషయాలన్నీ కదలిపోయే మేఘములవంటివే. ఆత్మ ఒక్కటే శాశ్వతమైనది. చిన్నపిల్లవాడు యువకుడౌతాడు, యువకుడు వృద్ధుడౌతాడు. దేహం మార్పు చెందుతుందిగాని, 'నేను' మార్పు చెందదు. మనం రైలులో ప్రయాణమై వెళుతుంటే గుట్టలు, చెట్లు అన్నీ పరుగెత్తుతున్నట్లు కనిపిస్తాయి. ఏమీ తెలియని పిల్లవాడు గుట్టలు, చెట్లు పరుగెత్తుతున్నాయే అని ఆశ్చర్యపడుతుంటాడు. మేఘాలు పరుగెత్తుతుంటే చంద్రుడుకూడా పరుగెత్తుతున్నట్లు కనిపిస్తాడు. కాని, చంద్రుడు పరుగెత్తడు. పరుగెత్తేవి మేఘాలే. అదేరీతిగా, మీ భావాలే పరుగెత్తుతున్నాయి. ఆత్మతత్త్వం నిశ్చలమైనది. కనుక, మీరు నిత్యసత్యమైనవారు. ఈ సత్యాన్ని మొట్టమొదట గుర్తించాలి. ఏ సాధనలూ చేయకపోయినా ఫరవాలేదు, నిత్యసత్యమైన ఆత్మతత్త్వాన్ని దృఢంగా విశ్వసిస్తే చాలు; అందులోనే మీకు సర్వసాధనల ఫలితం లభిస్తుంది.

**మీరుకూడా హిరణ్యగర్భులే!**

ప్రేమస్వరూపులారా! ఈనాడు చాలా పవిత్రమైన దినము. ఆరు గంటలకు చాలా ఉత్తమమైన కాలం ప్రవేశిస్తుంది. అప్పుడే ఆత్మలింగోద్భవం జరుగుతుంది. భగవంతునికి హిరణ్యగర్భుడని పేరు. హిరణ్యగర్భునినుండియే హిరణ్య లింగములు ఆవిర్భవిస్తాయి. అయితే, ఇవి కేవలం స్వామి నుండియే ఆవిర్భవిస్తాయని అనుకోవటం చాలా పొరపాటు. మీరుకూడా హిరణ్యగర్భులే, శాశ్వత స్వరూపులే. ఈ Awareness (ఎఱుక)ను మీ హృదయంలో స్థిరం చేసుకోండి. Awareness అంటే పరిపూర్ణమైన Understanding (అవగాహన). ఏవో కొన్ని విషయాలనుగూర్చి ఏదోకొంత నేర్చుకుంటే అది 'అవేర్‌నెస్' అని చెప్పటానికి వీలుకాదు. (కర్చీఫ్‌ను చేతిలో ముడిచి పట్టుకొని కొద్దిగా పైకి చూపిస్తూ) ఇదేమిటి? అని ప్రశ్నిస్తే, కర్చీఫ్ అని చెబుతారు అది 'అవేర్‌నెస్' అవుతుంది. ఎలుకతోకను చూసి ఎలుకను

sri sathyasai vahini amrutam

చూశాననుకోవటం 'అవేర్‌నెస్' ఎలా అవుతుంది? ఈనాటి సైంటిస్టులు చేస్తున్న పని ఇదే! ఏవో చిన్నచిన్న విషయాలను తెలుసుకొని అంతా తెలుసుకున్నట్లుగా భావిస్తున్నారు. మొదట మీరు మానవత్వాన్ని పరిపూర్ణంగా గుర్తించుకోవాలి. మీలో మానవాకారానికి తగిన భావాలు, ప్రవర్తన ఉండాలి. ఆకారంలో నరునిగా, ఆచరణలో వానరునిగా ఉంటే ప్రయోజనమేమిటి? మీరు Mankind (మానవజాతి) కి చెందినవారు. కనుక, Monkey-mind (కోతిబుద్ధి)ని వదలిపెట్టండి. Kindness (దయ)ను అభివృద్ధిపరచుకోండి.

**దురాశతో ప్రకృతి వనరులను దోచుకుంటే...**

మీకు తెలుసు – మొన్న గుజరాత్‌లో భూకంపం వచ్చింది, ఎన్నో వేలమంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రకృతివైపరిత్యానికి కారణమేమిటి? మానవుని ప్రవర్తన సరిగా లేకపోవటమే. మానవుడు ఎంత సాధించినా తృప్తి పడటం లేదు. మితిమీరిన ఆశకు లోనౌతున్నాడు. భగవంతుని సృష్టిలో సర్వత్రా Balance (సమతుల్యత) ఉన్నది. భూమి, సముద్రాలు 'బ్యాలెన్స్'తో కూడినవి. కాని, మానవుడు దురాశచేత భూమిని త్రవ్వి ఆయిల్‌ను తీసేస్తున్నాడు, సముద్రంలో ప్రతి రోజూ కొన్ని కోట్ల చేపలను పట్టేస్తున్నాడు. దానివల్ల భూమిలోనూ, సముద్రంలోనూ 'బ్యాలెన్స్' తప్పిపోయి భూకంపం సంభవిస్తున్నది.

మానవుడు మొట్టమొదట తనలో ఉన్న 'కంపము'ను తొలగించుకోవాలి. అప్పుడే భూకంపాలు రాకుండా నిరోధించవచ్చు. ఒక్క భారతీయులే కాదు, అన్ని దేశాలవారూ సృష్టిలోని 'బ్యాలెన్స్'ను కాపాడుకోవాలి. పంచభూతములన్నీ భగవత్స్వరూపములనే సత్యాన్ని గుర్తించి వర్తించినప్పుడే మానవునికి క్షేమం కల్గుతుంది. మొన్న గుజరాత్‌కు కొన్ని లారీలలో బియ్యం, బేడలు మొదలైన నిత్యావసర వస్తువులను పంపించాను. అప్పుడు కొంతమంది "స్వామీ! ఇంత ఖర్చు పెట్టి ఇన్ని వస్తువులను పంపే బదులు అసలు భూకంపమే రాకుండా చేస్తే ఈ బాధలే ఉండవు కదా!" అన్నారు. అప్పుడు నేను చెప్పాను: "నాయనా! భూకంపాలకు కారణం మానవులే. ప్రకృతికున్న 'బ్యాలెన్స్'ను మానవులే పాడుచేస్తున్నారు. అందుచేతనే భూకంపాలు సంభవిస్తున్నాయి. అది Law of nature (ప్రకృతి నియమం). ఇలాంటి పరిస్థితిలో మీరు Love of man ను అనుభవించాలి". అనగా, ఆపదలో ఉన్నవారిని ప్రేమతో ఆదుకోవాలి.

srisathyasaivachanamrutam

ప్రేమయే మీ స్వభావం. ప్రకృతికి 'బ్యాలెన్స్' ఎంత అవసరమో మనిషికి ప్రేమ అంత అవసరం. భగవంతుడు సృష్టించినవన్నీ మీ మంచికోసమేనని గుర్తించాలి.

ప్రకృతి అందించే వనరులను మీ అవసరానికి తగినంతగా వినియోగించుకోవాలే గాని, దురాశతో ప్రకృతిని దోచుకోకూడదు. ఒక బాతు ప్రతి దినము ఒక బంగారు గ్రుడ్డు పెట్టేదట. అది చూసి ఒక దురాశాపరుడు ఒకేసారి అనేక బంగారు గ్రుడ్లు లభిస్తాయని భావించి దాని పొట్ట కోశాడట. నేటి మానవుడు కూడా ప్రకృతి అందించే సుఖాన్ని తగినరీతిగా అనుభవించక, మితిమీరిన సుఖాన్ని అనుభవించాలనే ప్రయత్నిస్తున్నాడు. ప్రతి సైంటిస్టూ ఏదో ఒక నూతనమైన విషయాన్ని కనిపెట్టాలని చూస్తున్నాడు. సైన్స్ అండ్ టెక్నాలజీ పెరిగిపోవటం వల్ల భూకంపాలుకూడా పెరిగిపోతున్నాయి, సకాలంలో వర్షాలు కురవటం లేదు. సైన్స్‌ను పరిమితంగానే ఉపయోగించుకోవాలి. పరిమితిదాటితే ప్రమాదాలు సంభవిస్తాయి. విద్యార్థులారా! మీరింకా ఎంతో కాలం జీవించవలసినవారు. ప్రకృతి వనరులను దుర్వినియోగపరచకండి, వాటిని సరియైనరీతిలో కాపాడుకోండి. ఎలాంటి పరిస్థితులందైనా సత్య ధర్మాలను విస్మరించకండి.

**(21-02-2001 సాయంత్రం సాయి కుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్యసందేశము)**

sri sathyasaivachanamrutam